# మానవుని మంచి, చెడులు తన సంకల్పములపై ఆధారపడి ఉంటాయి

వివిధ శాస్త్రచయము వేద వేదాంగముల్
జీవి మనసు తెరను చీల్చలేవు
తెరకు ఇవ్వల జీవి దేవుడవ్వలనుండు
కార్యమివ్వల ఆవల కారణంబు
  మనసునందు మంచి మాటలందున మంచి
  నడతలందున మంచి పొడమకున్న
  సాయి యెట్లు మెచ్చి సంతోషమును యిచ్చు
  తెలుపరయ్య మీరె చెప్పరయ్య మీరె
  సాయి యెట్లు మెచ్చి సంతోషమును యిచ్చు
  చెప్పరయ్య మీరె ఒప్పుకుందు
  చెప్పరయ్య మీరె ఒప్పుకుందు
  చెప్పరయ్య మీరె ఒప్పుకుందు!
ఫిల్ము రికార్డింగు ప్లేటును చూచిన
ఒక్కరీతిగానె ఒనరియుండు
సౌండుబాక్సునందు సవరించి చూచిన
పాటలెన్నొ విధములు పలుకుచుండు!

ఆధ్యాపకులారా! విద్యార్థులారా!

పశుత్వము, దైవత్వము అను రెండు తత్త్వములతో కూడినటువంటిదే ఈ మనసు.

srisathyasaivachanamrutam

కామక్రోధాది అరిషడ్వర్గములైన దుర్గుణములకు లోనై, దైవ ప్రసాదితమైనటువంటి స్థితి, గతి, మతి, సంపత్తిని సద్వినియోగపరచుకొనక, దుర్వ్యసనములకు లోనై దుష్టుడై దుర్గతిని పొంది, మానవుడు పతితుడై పశువుకంటె హీనమైపోతున్నాడు. అట్లుకాక కాలమును, కర్మమును, సంపత్తిని, స్థితిని, గతిని ధర్మబుద్ధితో ఉత్తమ భావములతో దైవముయొక్క దీక్షను నీతి నిజాయతీలతో మానవత్వముకంటే మిన్నయైనటువంటి దైవత్వమును పొందటము, ఇది ఒక మార్గము. సత్సంకల్పములను పెంచి, పదిమందికి పంచి, ఇదియే మానవునియొక్క ప్రధానమైన ధర్మమని భావించి, సర్వ పదార్థములను సద్వినియోగపరచుకొనటం ప్రధానమైన కర్తవ్యము. చూచుటకు మానవులందరూ ఒక్కటే అయినప్పటికిని 'ముండే ముండే మతిర్భిన్నః' అని ఒక్కొక్కరి తలంపులు వేరుగా, నడతలు వేరుగా, మాటలు వేరుగా కనిపించుచున్నవి. ఈ మూడింటిని యేకత్వము గావించి, దివ్యత్వమును చింతించి, మానవత్వమును సార్థకము చేసుకొనటమే మనసుయొక్క ప్రధానమైన కర్తవ్యము.

**జగత్తంతయు మనస్సుయొక్క స్వరూపమే!**

సంకల్పములు ఎట్టివో, తనయొక్క స్థితిగతులుకూడా అట్టివే! కనుక, మానవునియొక్క మంచిచెడ్డలు సంకల్పములపైన ఆధారపడివుంటున్నవి. ఈ సంకల్పములు రెండు విధములుగా వుంటున్నవి. ఒకటి శుద్ధ సంకల్పము, రెండవది అశుద్ధ సంకల్పము. ఎప్పుడునూ పరులయొక్క దోషములను వెదకటము, పరుల కీడును ఆశించటము, పరులను పీడించటము, పరులకు దుఃఖమును అందించటము, దివ్యత్వమును విస్మరించటము, అపవిత్రతను విశ్వసించటము. ఈ విధములైనటువంటి చర్యలలో తనయొక్క సంకల్పములను యిమడ్చటము అశుద్ధ సంకల్పములయొక్క ప్రభావము. యీ అశుద్ధ సంకల్పములు ప్రథమములో ఆనందముగా కనిపించవచ్చును. తనయొక్క చర్యలు మంచివిగా కనిపించవచ్చును. కాని, యివి ముమ్ముందు చాలా ప్రమాదములకు గురిచేయుచున్నవి. మనము యితరులకు కీడు తలపెట్టినప్పుడు అవి కొంతవరకు యితరులకు కీడు చేయవచ్చును, కాని, ఎదురుతిరిగి యీ కీడు తలపెట్టినవానికే ఎక్కువ

sri sathyasai vachanamrutam

కీడును చేకూర్చును. కనుక, పరదూషణ, పరనింద, పరులను పీడించటము మహాపాతకముగా మనము భావించాలి. సంకల్పములయొక్క ప్రభావము మానవునియందు క్షణక్షణము కనిపించుచున్నది. 'సంకల్పవికల్పాత్మకమ్ మనః' అని మనస్సుయొక్క ప్రభావము సంకల్ప వికల్పములతో కూడినది కాకుండా యీ సంకల్పములు నిరంతరము మననముకూడా చేయుచుండును. కనుక దుస్సంకల్పములకు మనము ఏ మాత్రము స్థానం యివ్వరాదు. పరుల క్షేమమును, పరుల ఆనందమును, లోకకళ్యాణమును ఆశించి దైవచింతనచేత సదాలోచనలు, సచ్చింతనలు సలిపి జీవితమును సద్గతి మార్గములో పోవునట్లు చూచుకోవాలి. ఇదే మనసుయొక్క ప్రధానమైనటువంటి ఫలితము. సమస్త పదార్థములుకూడను సంకల్పములయొక్క స్వరూపములే! యీ పాంచభౌతికమైన ప్రపంచము, యీ దేహము సంకల్పములయొక్క స్వరూపమే! ఈ జగత్తంతయుకూడను సంకల్పములయొక్క స్వరూపమునుండి ఆవిర్భవించినది. 'మనోమూలం మిదం జగత్' అని జగత్తంతయుకూడను మనసుయొక్క స్వభావమే, స్వరూపమే! ఈ సంకల్పములు మనిషినుండి మనిషికి ప్రయాణము చేయవచ్చును. ఈ సంకల్పములు చాలా శక్తివంతమైనవి. ప్రపంచమునే స్తంభింపజేయగలవు, తన హస్తగతము గావించగలవు. ఈ ప్రపంచమునే కదిలించగలవు. ఇట్టి సంకల్పములయొక్క ప్రభావమును మనము గుర్తించుకొనక, ఆవిర్భవించిన సంకల్పములను నిత్యానిత్యపరిశీలన సలపక, మనము స్వేచ్ఛగా వదలిపెడుతున్నాము. కనుకనే, మానవుడు అనేక కష్టములకు, నష్టములకు, దుఃఖములకు, విచారములకు గురి అవుచున్నాడు. ప్రతి సంకల్పములను మనము చక్కగా విచారించి, వినియోగించాలి.

**మనిషిని నడుపునది మనసే!**

> **ఒక్క మనసునందె వున్నది లోకంబు**
> **తిక్కబట్టి నరుడు తిరుగనేల**

అన్నాడు వేమన. తనయొక్క తత్త్వము, తనయందే వుండినప్పటికి తాను గుర్తించుకొనక, వెలుపల ప్రపంచములో ఏదో ఉన్నదని ప్రాకులాడుచున్నాడు, పిచ్చి మానవుడు.

srisathyasaivahini.org

సామాన్యమైన మానవునికూడను మాధవునిగా రూపొందింప చేసేటటువంటిదే ఈ సంకల్పములయొక్క ప్రభావము. పామరుని పరమహంసగా మార్చవచ్చు, మానవుడు మాధవత్వమును పొందవచ్చు. నరుడు వానరుడుగా కావచ్చు, మానవుడు రాక్షసుడుగా మారవచ్చు. ఈ అన్నింటికి మన సంకల్పములే కారణము. ఆనాటి పామరులు పరమహంసలవలె, మహర్షులవలె, యోగులవలె తయారుకావడానికి ఏది కారణము? వారియొక్క పవిత్రమైనటువంటి సత్సంకల్పములే! సంకల్పములు ఏయొక్క స్వరూపాన్ని చింతించునో ఆ స్వరూపముతో తాదాత్మ్యభావాన్ని పొందుతుంటాయి. మనము చెడ్డను సంకల్పించటమువలన, చెడ్డ స్వరూపమును పొందుతున్నాము. మంచినే చింతించటమువలన, మంచి ఆకారమును పొందుతున్నాము. బంగారమును కరిగించి ఒక మూసలో పోసినప్పుడు, మూస ఆకారమునే చెందుచున్నది. ఆనాటి మహర్షులు నిరంతరము దైవమునే చింతించుచు, మనసును దైవమునందే లీనము గావించుచుండిరి. కాలమును, కర్మమును, కాయమును దైవత్వమునకు అంకితము గావించటంచేతనే 'బ్రహ్మవిత్ బ్రహ్మైవభవతి' తాముకూడను అట్టి స్థితిని, అట్టి గతిని అనుభవించగలిగారు. 'యద్భావం తద్భవతి', 'ఎట్టి స్థితియో అట్టి గతి'. కనుక, మనము మంచిని చేసి, మంచిని చూచి, మంచిని తలచి, మంచిని చింతించటం అత్యవసరం. మనిషిని నడుపునది మనసే! అట్టి మనసును పురస్కరించుకొనియే ప్రవర్తనలు రూపొందుతున్నాయి. కనుక, మనసు చాలా ప్రధానమైనటువంటిది. కాని, మనసుకు ఒక విధమైనటువంటి దోషము వుంటుంటాది. 'నేను వేరు', 'దేవుడు వేరు' అనేటువంటి అజ్ఞానమే దీనియొక్క ప్రథమ దోషము.

వేదశాస్త్రయితిహాస పురాణములు, భగవద్గీత, బ్రహ్మసూత్రములు, ఉపనిషత్తులుకూడను 'నీవే బ్రహ్మవు, ఆత్మయే బ్రహ్మ'మని బోధించుచున్నప్పటికిని, మానవుడు తన అజ్ఞానమును విడువక నిరంతరము 'తాను వేరు, దైవము వేరు' అనేటువంటి బేధభావమునకు గురి అవుతున్నాడు. 'ఏకం ఏవ అద్వితీయం బ్రహ్మ' అని సమిష్టి స్వరూపమును తెలుపుతూ వచ్చాయి. సమస్త మతగ్రంథములుకూడను ఏకత్వమునే బోధిస్తున్నాయి. కాని ఇట్టి సత్యమును గుర్తించుకొనలేక, తన స్వస్వరూపాన్ని దర్శించుకొనలేక, దేహమే



srisathyasaivachanamrutam

నేననేటువంటి భావములో పడి ప్రమాదమునకు గురి అవుతున్నాడు. మహా వాక్యములైనటువంటి 'అహం బ్రహ్మాస్మి', 'ప్రజ్ఞానం బ్రహ్మ', 'అయమాత్మ బ్రహ్మ', 'తత్త్వమసి' అనేటువంటి వాక్యములయొక్క అంతరార్థమును గుర్తించి, ఇట్టి సత్యసూక్తులను విశ్వసించి దీనిని ఆచరణయందు వుంచినప్పుడే ఆత్మస్వరూపమును గుర్తించుటకు వీలవుతుంది. చిత్తతత్త్వమును ఆత్మస్వరూపకముగా విశ్వసించి, ఆనందమును అనుభవించి, పరులకు పంచటమే పవిత్రమైన చరిత్రలయొక్క స్వభావము.

**మానవత్వము సార్థకము చేసుకోలేని దేహము నిరర్థకము**

ప్రాచీనకాలమునుండి మన భారతీయులు అనేక విధములైనటువంటి ఆదర్శమార్గములు అనుభవించి, అందులో ప్రధానమైనటువంటి సారాంశమును గుర్తించి, గుణమే అన్నింటికంటే ప్రధానము, మూలము అని అర్థము చేసుకున్నారు. ధనము కోల్పోయినప్పుడు బాధపడేటువంటివారు కాదు. ఆరోగ్యము పోయినప్పుడుకూడా చింతించేవారు కాదు. ఏదోవిధముగా కష్టపడి ధనమును, ఆరోగ్యమును తిరిగి సంపాదించుకొనవచ్చును, అని భావించేవారు. కాని, గుణము పోయినప్పుడు ప్రాణమే పోయినట్టుగా చింతించేవారు. యీనాటి విద్యార్థులు, విద్యార్థినులు యీ సత్యములను చక్కగా గుర్తించి వర్తించటము అత్యవసరము. If wealth is lost, nothing is lost. If health is lost, something is lost. If character is lost, everything is lost. ఈ సత్య వాక్యములను వారు ఆధారము చేసుకొనియే జీవితములను కొనసాగిస్తూవచ్చారు. కాని యీనాటి ఆధునిక విద్యార్థులు తమయొక్క భావములను గుర్తించుకొనక మితిమీరినటువంటి స్వేచ్ఛకు దారిచ్చి, తాము గతులను తప్పి, మతులను చెరుచుకొని దుర్గతిని అనుభవిస్తున్నారు. ఆనాటి పవిత్రమైన సూత్రమును వెనుకదారిని పట్టిస్తున్నారు. ఒక కారుగాని, బస్సుగాని, ట్రైనుగాని, ప్లేనుగాని రివర్సుగేరు వేసి డ్రైవింగ్ చేసుకుంటూపోతే అది వెనుకకు పోతుందేగాని ముందుకు పోదు. విద్యార్థులు యీనాడు రివర్సుగేరులో ప్రయాణము సల్పుతున్నారు. If character is lost, nothing is lost అంటారు. If health is lost, something is lost అంటారు. కాని If wealth is lost, every-

sri sathyasai vachanamrutam

thing is lost అంటారు. ఏమిటి యీ health? Health is Wealth అంటారు. హెల్తు ఎందుకోసం వుండాలి? ఈ దేహమును సత్కర్మలలో, సత్కార్యములలో ప్రవేశపెట్టినప్పుడు ఈ హెల్తు అవసరమే. దుర్మార్గములయందు, దుష్ప్రవర్తనలయందు ప్రవేశింపచేసినపుడు ఈ దేహము వుండుటకంటే పోవుటమంచిది. మానవత్వము సార్థకము చేసుకోలేనటువంటి ఈ దేహము నిరర్థకమనే చింతనే చాలా మంచిది. దేహముయొక్క ఆరోగ్యము ప్రధానముకాదు. మనసుయొక్క యోచన అత్యవసరమైనటువంటిది. సత్సంకల్పములు మనము అభివృద్ధి పరచుకున్నప్పుడే సన్మార్గములో ప్రవేశపెట్టుటకు వీలవుతుంది. ఆనాటి మహనీయులు ఒక్కొక్క సంకల్పమును, ఒక్కొక్క ఉత్తమమైన మార్గములో ఉపయోగపెడుతూ వచ్చారు.

## స్వార్థరహితమైన కోపముకూడను ఉత్తమమార్గమునే చేకూర్చుతుంది

కోపము చాలా చెడ్డది అని భావిస్తూ వచ్చారు. కాని, ఆ కోపముకూడను చెడ్డదికాదు. సమయసందర్భములను పురస్కరించుకొని ఆ కోపము చాలా ఉపకారముగా వుంటుంది. క్షమ, కరుణ చాలా మంచివని భావించెడివారు. క్షమ, కరుణలుకూడను సమయసందర్భములను పురస్కరించుకొని ఉపయోగించుకోవాలి. లేకుంటే ఆ క్షమ, కరుణలు చెడ్డవే అవుతాయి. దుర్వాసుడు తనయొక్క కోపమును తపస్సుగా భావిస్తూవచ్చాడు. ఆ తపస్సే అగ్నిగా విశ్వసిస్తూవచ్చాడు. ఈ కోపమునే జలముగా విశ్వసిస్తూవచ్చాడు. తపస్సు అగ్ని, కోపము జలము. అయితే అగ్నిని జలము ఆర్పగలదు. కాని కొన్ని కొన్ని సమయములందు జలమునందే అగ్నిని సృష్టింపవచ్చు. కనుక జలమునందు అగ్ని, అగ్నినందు జలముకూడను విహీనములై యుంటున్నవి. వీటిని ఉపయోగించుకునే విధానములోనే మంచిచెడ్డలు రూపొందుతూ వస్తున్నవి. స్వార్థరహితమైనటువంటి కోపముకూడను ఉత్తమమైన మార్గమునే చేకూర్చుతుంది. ధర్మబద్ధమైనటువంటి కోపము ఉపకారమునే గావిస్తుంది. ఇతరులయొక్క అజ్ఞానమును, అహంకారమును, అసూయాది మమత్వములను దూరము గావించుటకై కోపముకూడను కొంత ఉపయోగపెట్టవలసివస్తుంది. మహనీయులయొక్క కోపముకూడను మంచినే

srisathyasaivachanamrutam

చేస్తూవచ్చింది. కారణము, తాము స్వార్థరహితమైన భావముతో కోపమును ఉపయోగపెడుతూ వచ్చారు. పవిత్రమైన కార్యములు అభివృద్ధిపరచుకునే నిమిత్తమై, మానవునియొక్క దుష్ప్రవర్తనను కొంచెం అణగద్రొక్కే నిమిత్తమై, అజ్ఞానమును, అహంకారమును రూపుమాపే నిమిత్తమై, పరులను రక్షించే నిమిత్తమై కొన్ని కొన్ని సమయ సందర్భములయందు కోపము ఉపయోగపెట్టవలసివస్తుంది. దుర్వాసునియొక్క కోపము అన్ని సందర్భాలలో మంచినే చేస్తూ వచ్చింది. కారణం, తాను తన కోపమును స్వార్థరహితముగా ఉపయోగపెడుతూవచ్చాడు. సత్యమును వీడక, ధర్మమును ఉల్లంఘించక, స్వార్థరహితమైన మార్గములో కోపమును ఉపయోగపెట్టినప్పుడు యిది పవిత్రమైన మార్గములో ప్రయాణము సలుపుతుంది.

**సంకల్పము పుట్టిన తక్షణమే ఇది మంచిదా, చెడ్డదా అనే విచారణ సలపాలి**

అదే విధముగనే శాంతి, క్షమ, కరుణ కొన్ని కొన్ని సమయములయందు ధర్మ విరుద్ధముగా ప్రవర్తిస్తూవస్తాయి. పరిపాలనాదక్షుడైన రాజు దయ, క్షమ, కరుణ అనేటువంటి యీ మూడును అవలంబించెనా, తన పరిపాలనే స్తంభించిపోతుంది. తప్పుచేసిన వారందరిని క్షమిస్తూ, దుర్మార్గులైన వారందరిని కరుణిస్తూ, దయతో వారిని చూస్తూపోయినప్పుడు పరిపాలనా పద్ధతి పూర్తిగా పెడమార్గము పడుతుంది. ఏనుగునకు అంకుశము ఎంత ప్రధానమో ఆధారమో, గుఱ్ఱమునకు కళ్ళెము ఎంత ప్రధానమో, తప్పునకు శిక్షకూడా అంత ప్రధానము. ఆ శిక్షణే లేకుండిన రక్షణే జరగదు. కనుకనే మానవత్వములో కొన్ని సంకల్పములు ఉత్తమమైనవని మనము భావించవచ్చును. కొన్ని చెడు అని విశ్వసించవచ్చును. మంచి చెడ్డలయొక్క ప్రభావములు మనసుపైన ఆధారపడి వుంటుంటాయి. కనుక, మనస్సు పరిశుద్ధమైన, స్వార్థరహితమైన భావములు అవలంభించినపుడు సర్వముకూడను మంచిగానే రూపొందుతాయి. కనుకనే సంకల్పములయొక్క ప్రభావములను అతి సూక్ష్మముగా విచారించవలసివస్తుంది. భౌతికముగా, ప్రాకృతికముగా యీ సంకల్పములయొక్క స్వరూపములను విశ్వసించటము చాలా కష్టము. హృదయమునందు ఎట్టి దుర్భావములులేక సంకల్పములను పరిశుద్ధముగా

srisathyasaivachanamrutam

ఆవిర్భవించుకొని 'లోకాస్సమస్తా సుఖినోభవన్తు' అందరూకూడను క్షేమముగా వుండాలి అనేటువంటి సత్సంకల్పములు పోషించుకున్నప్పుడు సర్వముకూడను మంచిగానే పోతుండాది. కనుక సంకల్పములు పుట్టిన తక్షణమే యివి మంచివా, చెడ్డవా అనే విచారణ మనము సల్పాలి. నిరంతరము మన చిత్తమునందు చెడు సంకల్పములు అభివృద్ధిపరచుకున్న జీవితము చెడు మార్గములో ప్రవేశిస్తుంది. ఒక్కొక్క చిన్న విషయాన్నికూడను మనము విచారణ చేసినపుడు యిది పరులకు చేసేటువంటి అపకారమా? లేక తనకు తాను చేసుకున్నటువంటి అపకారమా? అనేటువంటి సత్యము తెలుసుకోటానికి వీలవుతుంది.

ఒక విషయము, యిద్దరు స్నేహితులను విందుకు పిలవాలని అనుకున్నాము. యీ విందు ఆ యిరువురికి మాత్రమే కాదు. పరులకోసం చేసినట్టి విందును మనముకూడా ఆరగిస్తున్నాము. కాని పరులకోసము చేసినట్టుగా మనము భావించుకుంటున్నాము. పరులకోసం చేసేటువంటి విందును మనముకూడను అనుభవిస్తున్నాము. అదే విధముగా మనము పరులకోసం చింతించినటువంటి చెడు సంకల్పములు మనకు అనుభవములోనికి వచ్చి మనలనుకూడా హింసిస్తాయి. ఉదాహరణకు, దేశము నాశనము కావాలని సంకల్పించుకుంటాము. దేశనాశనముతోపాటు ఆ దేశములో వున్న మనముకూడా నాశనము కావలసివస్తుంది. సంకల్పము ఒక్కటైనప్పటికి యిది అనేక స్వరూపములు ధరిస్తుంటాది, అనేక రూపములు ఉద్భవిస్తుంటాయి. ఒక టీ పార్టీ పెట్టాలని సంకల్పము వచ్చింది. ఆ సంకల్పము నెరవేర్చుటముకోసం తక్షణమే ప్లేటు, సాసర్లు, టీ, పాలు, బిస్కట్లు, టేబుల్స్, చైర్సు అన్ని ఆవిర్భవిస్తున్నాయి. ఒక్క సంకల్పమువల్ల ఎన్ని పదార్థములు అవిర్భవిస్తున్నాయో! ఒక్క సంకల్పము అనేక విధములుగా రూపొందుతున్నాది, అనేక విధములైన క్రియలను అనుసరిస్తున్నాది. కనుక, సంకల్పములయొక్క ప్రభావాన్ని చక్కగా గుర్తించటము అత్యవసరము.

### అన్నింటియందు ధర్మము అతర్భూతమైయుండాలి

మనము మానవులుగా పుట్టినాము. కనుక, మానవులయందు మంచి సంకల్పములే

అభివృద్ధిపరచుకోవాలి. అజ్ఞానరహితుడు, మానవుడు. కాని మనము అజ్ఞానము సహజమని భావిస్తున్నాము. ఆ విధముగా భావించటమే పెద్ద అజ్ఞానము. అజ్ఞానము నీ సహజముకాదు, అసహజము. లేకుండిన 'జంతునాం నరజన్మ దుర్లభం' అని చెప్పుటకు వీలేలేదు. ప్రాచీనకాలమునుండి మానవునియొక్క అభివృద్ధికోసమని, ఉన్నతస్థితికోసమని ధర్మ, అర్థ, కామ, మోక్షములు అనే చతుర్విధ పురుషార్థములు స్థాపిస్తూవచ్చారు. ఇవి దేశ సంరక్షణకోసమని. మానవత్వాన్ని దివ్యత్వమునకు చేర్చేటువంటి మార్గముకోసమని. ప్రప్రథమములో ధర్మము వుంటుండాది. ధర్మమును గుర్తించటానికి ప్రయత్నించాలి. కాని యీనాటి యువకులు ధర్మమోక్షములనేటువంటి తలతోకలను మరచి పోతున్నారు. మధ్యనున్న మొండెమును పట్టుకొని బాధపడుతున్నారు. మొదటిది ధర్మము, కడపటిది మోక్షము. ఈ రెండింటిని విస్మరించి కేవలము మధ్యభాగమును పట్టుకొని జీవిస్తున్నాము. అర్థ, కామములే ప్రధానమని భావిస్తున్నాము. యీ అర్థకామములు ధర్మమయము కాకుండిన చాలా ప్రమాదములు కలిగిస్తాయి. ధర్మము వున్నచోట వుండక తన స్థానమువదలి, అర్థమును చేరి, ఆ అర్థమును ధర్మార్థముగా మార్చి, ఈ ధర్మార్థములు రెండూ చేరి కామము దగ్గర ప్రవేశించి, ధర్మమయమైన కామమును అనుభవించి ఈ మూడుకూడను ధర్మమయమైనప్పుడు మోక్షము మనలను వరిస్తుంది. కనుక, అర్థమును ధర్మమయము గావించాలి. మన వాంఛలను ధర్మమయము గావించాలి. అన్నింటియందుకూడను ధర్మము అంతర్భూతమైయుండాలి. ఈ విధమైనట్టి మార్గము అవలంబించినప్పుడే మనయొక్క పురుషార్థములను సార్థకము గావించుకున్నవారమవుతాము. యీనాడు వివాహ సమయములో కూడను 'ధర్మేచ, అర్థేచ, కామేచ నాతిచరామి' అంటున్నారు కాని మోక్షమును విస్మరిస్తున్నారు. కనుక, ధర్మమోక్షములను ప్రధానంగా లక్ష్యమునందుంచుకోవాలి. యీ లక్ష్యమును దృష్టియందుంచుకొని ప్రాచీనులు వారి జీవితముయొక్క గమ్యమును చేరుతూవచ్చారు. యీనాటి మానవులకు గమ్యము అక్కరలేదు. స్వేచ్ఛావిహారము సలుపుతూ ఎక్కడో ఒకచోట అంత్యమైపోతున్నారు. ఇది కాదు, మానవునియొక్క కర్తవ్యము. 'ఎచ్చటపుట్టె నచ్చటకి నేగుట నైజము ప్రాణికోటికిన్' ఎక్కడనుండి వస్తిమో అక్కడకు చేరటమే మనయొక్క



srisatyasaivachanamrutam

లక్ష్యమైయుండాలి. యీ గమ్యమునకు చేరుటకై మనము సత్సంకల్పములు పోషించుకోవాలి. ఎట్టి సాధనలు సలపకపోయినప్పటికిని, సత్సంకల్పములు పోషించుకొని, సన్మార్గములో ప్రవేశించి, సత్సంగములో చేరి మనయొక్క జన్మను సార్థకము గావించుకోవాలి. దేహము నీటిబుడగవంటిది. ఏ క్షణము ఎక్కడ కూలిపోవునో, ఎక్కడ రాలిపోవునో! కాబట్టి, మన సంకల్పములను ఎప్పటికప్పుడు మంచివిగా రూపొందించుకోవాలి. సత్సంకల్పములు కలిగినటువంటి మానవునకు సర్వము తన హస్తగతమైపోతుంది. మనము చేసే సర్వ కర్మలుకూడను సంకల్పములయొక్క స్వరూపములే! సంకల్పమే లేకుండిన సర్వముకూడను శూన్యమైపోతుంది. జగత్తంతయుకూడను 'హిరణ్యగర్భుని ప్రథమ సంకల్పమే ప్రధానమైనటువంటిది, అదే దీనికి ఆధారమ'న్నారు. కనుక సంకల్పములను పవిత్రమైనటువంటివిగా రూపొందింపచేసుకోటం చాలా అవసరము. దుస్సంకల్పములను లోపలనుంచుకొని పైపైన మనము మంచిగా నటించవచ్చు. లేక బయట ప్రవర్తనలు దుర్మార్గముగా కనిపించవచ్చును, లోపల సంకల్పములు పవిత్రముగా రూపొందించవచ్చు. ఇది ప్రయోజనము కాదు. మనస్సునందు, వాక్కునందు, క్రియయందు, ఈ మూడింటియందుకూడను యేకత్వము కావాలి. కనుక, యిట్టి త్రికరణశుద్ధితో కూడినటువంటి సంకల్పమే ప్రధాన సత్సంకల్పము. అప్పుడే పూర్ణ మానవుడుగా రూపొందుతాడు. The proper study of mankind is man. Mankind అనగా మన మనస్సు, వాక్కు, క్రియ మూడింటి యేకత్వమే. జగత్తులో అనేకమైనట్టి భిన్నత్వములు కనిపిస్తున్నవి. మనము ఈ భిన్నత్వములో ఏకత్వమును గుర్తించాలి. ఈ ఏకత్వములో యున్నటువంటి ఆనందాన్ని మనము చవిచూడాలి. అప్పుడే దివ్యత్వమును అర్థము చేసుకున్నవారమవుతాము. యీనాడు అనేకత్వములో యున్నటువంటి ఏకత్వాన్ని గుర్తించక, ఏకత్వాన్ని అనేకత్వముగా రూపొందింపజేసుకుంటున్నాము.

**దుస్సంకల్పములను దూరము చేసుకోవాలి**

ఏ దేశమునందుగాని, ఏ కాలమునందుగాని ప్రతి మానవుడుకూడను దుః

sri sathyasai vahini amrutam

ఖమయమైనట్టి జీవితాన్ని అనుభవిస్తున్నాడు. ఏ మానవుడుకూడను శాంతిభద్రతలను అనుభవించటంలేదు. కారణము, తాను దుస్సంకల్పములతోనే నిండియున్నాడు. కనుక, మనము దుస్సంకల్పములను దూరము చేసుకోవాలి. ఈ జీవితము చాలా పవిత్రమైనటువంటిది. ఎవరికి ఏది చేసినప్పటికి అది తిరిగి మనకు లభిస్తుంది అనే విశ్వాసము అభివృద్ధిపరచుకోవాలి. అట్టి విశ్వాసము యుండినప్పుడే మనము ఇతరులకు చెడు చేయకుండాయుంటాము. ఏదో ఇప్పుడు చేయవలసింది మనము చేసి, దాని ఫలితము ఎప్పుడు వస్తుందో చూసుకుంటాము అంటే అది తామసము అయిపోతుంది. రజోగుణ స్వరూపముగా రూపొందుతుంది. కామక్రోధములకు పుట్టినిల్లు రజోగుణమే. ఈ రజోగుణము మానవుని హతమారుస్తుంది. శుద్ధసాత్త్విక సంకల్పములచేత సాత్త్విక మానవుడుగా తయారుకావాలి. ఇదే నిజమైనటువంటి విద్య. ఈ విద్యను మనము అభ్యసించినప్పుడే ఆత్మవిద్య, లౌకిక విద్యలయందుకూడను సక్రమమైన మార్గములను అవలంబిస్తాము. విద్య, తపస్సులయొక్క సమ్మిళితమే నిజమైన దివ్యత్వము. తపస్సనగా ఏమిటి? ఈ మూడింటిని ఏకత్వము చేయటమే తపస్సు. కేవలము అరణ్యమునకు వెళ్లి, ఏదో గుహలలో కూర్చొని దైవాన్ని చింతించటం మాత్రమే తపస్సుకాదు. త్రిగుణములను ఏకము గావించి, దివ్యమైనటువంటి భావములో ప్రవేశింపచేయటమే తపస్సు. ఆ విధముగా త్రిగుణములను ఏకత్వము గావించకుండిన తమస్సుగా మారిపోతుంది. కాబట్టి, మనము తమస్స్వరూపులు కాకూడదు, తపస్స్వరూపులు కావాలి. నిరంతరము సత్సంకల్పములయొక్క తపమును ఆచరించాలి. ఆ సత్సంకల్పములయొక్క తాపమే తపస్సుగా మారిపోవాలి.

**మనస్సనగా సంకల్పములయొక్క చేరిక**

సంకల్పములను మనము ప్రాణసమానముగా విశ్వసించాలి. సత్సంకల్పములుగా తీర్చిదిద్దుకోవాలి. ఎవ్వరికి ఏ సమయమునందైనా అపకారముగాని, కీడుగాని తలంచరాదు. అందుకోసమనే 'చెడపకురా చెడెదవు' అన్నారు. ఇతరులయొక్క చెడును మనము కోరుతుంటే ఆ చెడు మనకుకూడా సంభవిస్తుంది. మనము గోడకు ఒక బంతిని

కొడితే తిరిగి మనవైపు వస్తుంది. ఎంత గట్టిగా కొడితే అంతే గట్టిగా మనవైపు వస్తుంది. మనము ఇతరులయొక్క ఒక్క దోషము చూపితే, మనయందు మూడు దోషములు చూపుతుంది. వీడు చెడ్డవాడు అని ఒకవేలితో చూపితే మనము చెడ్డవారమని మూడు వేళ్లు చూపుతుంది. ఈ సత్యాన్ని మనము చక్కగా గుర్తించి, వర్తించాలి. మీలో మూడు దోషములు వుండినాయి కాబట్టి ఇతరులయొక్క ఒక్క దోషమును వేలెత్తి చూపుతున్నారు. ఇతరులలో యున్నటువంటి దోషములకంటే మనలోనే ఎక్కువ దోషములుంటున్నవి. ఎక్కువ దోషములు కలిగినటువంటివాడే పరులయొక్క దోషాన్ని పరికిస్తాడు. ఈ సత్యాన్ని మనము చక్కగా గుర్తించాలి. ఎవ్వరిని మనము నిందించరాదు, బాధించరాదు. ఎవరి చెడ్డను కోరరాదు. అందరి మంచిని మనము కోరుతూరావాలి. అప్పుడే నీ హృదయమునందు చక్కని పవిత్రమైన భావములు అవిర్భవిస్తాయి, అభివృద్ధి అవుతాయి. మనస్సంటే సంకల్పములయొక్క చేరికగా గుర్తించాలి. మనస్సంటే మనిషే, మనిషంటే మనస్సే! మనస్సంటే సంకల్పములు. సంకల్పములకు మన నిత్యజీవితములో యున్న ప్రవర్తనలే ప్రధానము. సంకల్పములయొక్క పరిణామములే మన ప్రవర్తన. కాబట్టి మన ప్రవర్తన మంచిదిగా యుంటుండాలి. ప్రవర్తన మంచిదిగా యుంటున్నప్పుడే ప్రపంచము మంచిదిగా వుంటుండాది. మన వ్యక్తిత్వాన్ని మంచిదిగా పోషించుకునే నిమిత్తము మన ప్రవర్తనలు అతి పవిత్రముగా రూపొందింపచేసుకోవాలి. అదే character అన్నారు. Character అనగా ఏమిటి? ఏవో కొన్ని మంచిగుణములుండినంత మాత్రమున character కానేరదు. మన behaviour, మన habbits, మన discipline ఇవన్నీకూడను మన నడతలతోపాటు సక్రమమైన రీతిలో వుంటుండాలి. మన నడతలలో, మన మాటలలో, మన చూపులలో, మన వినికిడిలో, మన హృదయములో అన్నింటియందు పవిత్రతను చేర్చుకోవాలి. కనుకనే, 'మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహత్మనం' అన్నారు. అదే మనయొక్క character కు సరియైన గుర్తు. 'మనస్ అన్యత్ వచస్ అన్యత్ కర్మణ్ అన్యత్ దురాత్మనాం' అన్నారు. అదే మనయొక్క చెడుమార్గములకు మూలకారణము అన్నారు. మన చూపును పవిత్రమైన చూపుగా రూపొందించుకోవాలి. ఎప్పుడూ చెడును చూడరాదు. చెడు మాటలలో ప్రవేశించరాదు. మన చిత్తమును పరిశుద్ధము గావించుకోవాలి.

## విద్యతోబాటు శీలమును పోషించుకోవాలి

రామాయణములో చక్కని ఘట్టములుంటున్నాయి. యీనాటి యువకులు వాటిని చక్కగా పాటించాలి. లక్ష్మణునియొక్క గుణములు గురించి రామాయణము ఎన్నో విధములుగా వర్ణించుచూవచ్చింది. 14 సంవత్సరములు అరణ్యములో ఒంటరిగా వుండినప్పటికిని సీత ముఖము ఒక్కనాడైనా చూచి యెరుగడు. హనుమంతునికి చిక్కిన ఆభరణములు చూచినప్పుడు లక్ష్మణుడు చెబుతున్నాడు 'అన్నా! యీ కేయూరములు, కర్ణములు నేను యేనాడూ చూడలేదు, అవి సీతవో కావో నాకు తెలియదు. కాని, కాలి అందెలు మాత్రము సీతవే, అవి మాత్రము నాకు తెలుసు' అన్నాడు. 'నిత్యం పాదాభివందనం'. ఎందుకంటే 'నిత్యం పాదాభివందనం చేసినప్పుడు చూచినవే, లేకపోతే అవికూడను చూచేటివి కావు', అన్నాడు. 'లక్ష్మణునియొక్క పవిత్రత నాకు తెలుసు, లోకము ఎరుగదు', అని భావించాడు. ఇదే కాకుండా లోకమునకు లక్ష్మణునియొక్క ఆదర్శమును నిరూపించే నిమిత్తమై, రాముడు కొన్ని పరీక్షలకుకూడను పూనుకున్నాడు. ఒకానొక సమయములోపల రాముడు, సీత, లక్ష్మణుడు ముప్వురుకూడను ఒక వృక్షముక్రింద విశ్రాంతి తీసుకుంటున్నారు. లక్ష్మణునియొక్క పవిత్రతను ప్రపంచమునకు చాటే నిమిత్తమై, రాముడు ఒక యుక్తిని పన్నాడు. 'నేను ముఖ్యమైన కార్యముమీద బయటకు వెళ్లవలసియుంటుంది, ఇది దట్టమైన అరణ్యము కాబట్టి నీవు కనురెప్ప మాత్రమైన విశ్రాంతి తీసుకొనక సీతను జాగ్రత్తగా చూస్తుండు' అన్నాడు, రాముడు. ఇది లక్ష్మణునకు ఒక పరీక్షగా తోచింది. సీత పాదములనే చూస్తూవున్నాడు. కొంతసేపయినప్పటికి ఆ వృక్షముమీద ఒక పక్షి వచ్చి వ్రాలింది. రాముడు ఈ పక్షి రూపము ధరించివచ్చాడు. 'ఎవ్వరు వచ్చినా సరే నేను సీతను కాపాడాలి', అని ప్రతిజ్ఞ చేసుకున్నాడు లక్ష్మణుడు. ఆ పక్షి ఒక శ్లోకాన్ని ఉచ్చరించింది.

**అతి మధురమైన పండును చూచినపుడు**
**పరిమళమైన పుష్పాన్ని ధరించినపుడు**
**ఒంటరిగా ఒక యువతిని చూచినపుడు**
**యువకుడు యేరీతిగా యుండగలడు?**

srisathyasaivachanamrutam

అనేటువంటి ఒక ప్రశ్న వేసింది. దానికి జవాబుగా

**సత్శీలవంతుడైనటువంటి తండ్రికి**
**పతివ్రతయైనటువంటి తల్లికి**
**పుట్టినటువంటి ఏ మానవుడుకూడను**
**దీనికి చలించడు**

అని లక్ష్మణుడు బదులు చెబుతున్నాడు. 'తల్లియందో, తండ్రియందో కొంత దోషముండినటువంటివాడే ఇటువంటి భావములకు గురి అవుతాడు కాని, ఇరువురియందు శుద్ధమైన, పవిత్రమైన భావములుండినవాడు ఏనాడుకూడను ఇటువంటి అపవిత్రములకు పాలుపడడు', అన్నాడు. మరొక ప్రశ్న వేసింది ఆ చిలుక: మదగజమువలె మనసు సంచరించేటువంటి సమయమునందు అనగా మంచి చెడ్డలు విస్మరించి కేవలము స్వేచ్ఛావిహారములు సలిపేటటువంటి సందర్భములోపల ఈ యువకుడు తాను ఏ విధమైనటువంటి నిగ్రహము చేయగలడు?' అన్నది. 'మదగజమైనప్పటికిని, స్వేచ్ఛావిహారము సలిపినప్పటికిని జ్ఞానమనే అంకుశముచేత దానిని అరికట్టగలను', అన్నాడు. 'జ్ఞానమనే అంకుశము కలిగినటువంటివానిని మదగజము ఏమి చేయలేదు', అన్నాడు లక్ష్మణుడు. తక్షణమే ఆ చిలుక రామ స్వరూపాన్ని ధరించి, 'లక్ష్మణా! నీ నిమిత్తమై కాదు. నీ సత్యము నాకు తెలుసు. కాని, లోకానికి వ్యక్తముగావించే నిమిత్తమై నిన్ను యీ విధముగా పరీక్షించాను', అన్నాడు రాముడు. కనుక, యువకులైనటువంటివారు యిలాంటి పవిత్రమైనటువంటి శీలమును అభివృద్ధిపరచుకున్నప్పుడే నిజమైన మానవత్వమునకు పూర్ణత్వము గావించినట్టివారమవుతారు. మనయొక్క విద్యాసంస్థయందు ప్రధానమైనటువంటి విద్య మన శీలపోషణే. అది లేనటువంటి విద్యలు ఎన్ని యుండినా ప్రయోజనమేమిటి? ఈ విద్యలన్నియుకూడను చెత్త చదువులే! ఎన్ని శాస్త్రయితిహాసపురాణములు చదివినప్పటికిని, ఎన్ని విధములైనటువంటి ప్రాపంచిక రహస్యములు గుర్తించినటువంటివారము అయినప్పటికిని నిజమైన గుణమే లేకపోతే ప్రయోజనము లేనటువంటి జీవితమే. కనుక విద్యతోపాటు గుణములను పోషించుకోవాలి.

srisathyasaivachanamrutam

**సకలశాస్త్రపురాణ సంగ్రహవేత్తయై**
**వేదాంతవేద్యుడౌ విబుధుడైన**
**రక్తి యేపారగ రమ్యహర్మ్యంబుల**
**రమియించు రాజచంద్రముడునైన**
**రణరంగమందు పరాభూతరిపుడౌచు**
**వెల్గొందు జగదేకవీరుడైన**
**దారిద్ర్యదేవతా దాక్షిణ్యమున కుందు**
**దౌర్భాగ్య విభుడగు దాసుడైన**
**గుణములేనిచో ఎందుకు పనికిరాడు**

అలాంటి గుణమే మనకు లేకపోయినపుడు మన చదువు ఎందుకు? మన సంపద ఎందుకు? మన జీవితము ఎందుకు? మన సర్వస్వమును ధారపోసి గుణమును సంపాదించుకోవాలి. దీనినే మనము ప్రధానమైన సంకల్పముగా అభివృద్ధిపరచుకోవాలి. అప్పుడే మనము సర్వాన్ని జయించినవారమవుతాము. ఇంద్రియములను మనము నిగ్రహించుకోవాలి.

**విద్యను ఆచరణలో పెట్టి ఇతరులకు ఆదర్శప్రాయముగా జీవించాలి**

ప్రహ్లాదుడు చిన్నపిల్లవాడు. ఆ చిన్నపిల్లవాడైనవాడు మహారాక్షసుడైనటువంటి హిరణ్యకశిపునకు చెబుతున్నాడు: 'తండ్రీ! లోకములన్నియున్ గడియలోన జయించినవాడవు, ఇంద్రియానీకము చిత్తమున్ గెలువనేరవు'. ఎన్ని జయించి ప్రయోజనము ఏమిటి? ఇంద్రియములను జయించలేనటువంటివాడు ఎన్ని రాజ్యములను జయించి ప్రయోజనమేమిటి? సముద్రమును శోధించినాడు, భూమినంతా త్రవ్వి శోధించినాడు, సర్వత్రా దైవత్వాన్ని పరికించటానికి ప్రయత్నించాడు, సమస్త శక్తిమంతుడు. అలాంటి హిరణ్యకశిపుడుకూడను ఇంద్రియములను జయించలేకపోయాడు. కారణము 'పశ్యతీతి పశుః'. తన దృష్టినంతాకూడను యీ ప్రకృతిపైననే ఆధారపెట్టుకున్నాడు. బయట దృష్టిని మాత్రమే అభివృద్ధిపరచుకున్నాడు. అంతర్దృష్టిని యేమాత్రముకూడను

sri sathyasai vachanamrutam

చింతించలేదు. బయటి దృష్టిని అభివృద్ధిపరచుకున్నంతవరకు పశువులమే, పశువులమే! ఏనాడు అంతర్భావములను మనము అభివృద్ధిపరచుకుందుమో ఆనాడే మనము చక్రవర్తులము. నీవు ఇంద్రియములకు జయించినవాడవైతే అన్ని రాజ్యములకు రారాజువవుతావు. అటువంటి వ్యక్తులు కొంతమందైననూ మన ఇనిస్టిట్యూట్‌లో తయారుకావాలి. ఈ విద్యలతోపాటు వివేకము, వివేకముతోపాటు విచక్షణ, విచక్షణతోపాటు వినయము, వినయముతోపాటు విద్యకూడా చేరినప్పుడే రాణిస్తాడు, మానవుడు. వినయములేని విద్య, విద్యకాదు. విద్యతలేని విద్య, విద్యకాదు. కేవలము విజ్ఞానము ఉండినంతమాత్రమున ప్రయోజనము ఏమిటి? ఉపయోగములేనటువంటి విజ్ఞానముకంటే ఉపయోగమైనటువంటి అజ్ఞానమే మేలు. అందువలననే నేను అప్పుడప్పుడు చెబుతుంటాను.

**పంటపండని భూమి పది ఎకరములు ఏల?**
**కొంచెమైనను చాలు మంచి భూమి.**

మనము పెద్ద పెద్ద డిగ్రీలు ఆశించనక్కరలేదు. ఎన్ని డిగ్రీలు ఉన్నప్పటికి ఆచరణలో లేనప్పుడు నీవు శుంఠవే! ఏమిటి ఈ విద్యలు? కుక్కలుకూడను విద్యలు నేర్పితే నేర్చుకుంటాయి. పూర్వము దున్నపోతుకూడా వేదము చెప్పిందంట! నేర్పిస్తే కోతులు సైకిలు త్రొక్కటంలేదా, పశువులు సర్కసులో ఎన్నో విధములుగా ఆటలు చేయటంలేదా? కేవలము నేర్చుకున్న విద్యలు, విద్యలవుతాయా? మనము ఆచరణలో పెట్టి, ఇతరులకు ఆదర్శప్రాయముగా మనము జీవించాలి. అదే నిజమైనటువంటి విద్య. ఆదర్శప్రాయమైనటువంటి జీవితము గడపాలి. ఎటువంటి ఆదర్శము? ఉత్తమ ఆదర్శము. మానవునిగా బ్రతకాలి, మానవునిగా జీవించాలి. మానవునిగా చావాలి. మానవునిగా పుట్టి, రాక్షసునిగా మరణించరాదు. కనుక పవిత్రమైన సంకల్పములు అభివృద్ధిపరచుకుంటే మనము దైవస్వరూపములుగా మారిపోతాము. ఇవి ఏదో కొంతకాలము మాత్రమే మనము ఆచరించటముకాదు, జీవిత పర్యంతము దీనిని అనుసరించాలి. యీ గాఢవిశ్వాసము పొందాలనుకున్నప్పుడు, మనము దైవాంశము అనే సత్యాన్ని విశ్వసించాలి. మీనుండి

srisathyasaivachanamrutam

దైవము వేరు అని భావించరాదు. ఈ భావన మీయందు ఉండినప్పుడు ఎదో కొంతకాలము మీరు భక్తిప్రపత్తులలో ఉండవచ్చును. తిరిగి బయట ప్రపంచములోనికి పోగానే నాస్తికులుగా తయారౌతారు. కనుక మీరు ఏ క్షణమైనాకూడను, ఎక్కడ ఉండినప్పటికిని దైవాంశులమే, దైవాంశులమే అనేటువంటి భావాన్ని దృఢము చేసుకోవాలి. కాబట్టి దైవాంశలయినట్టి మీరు దైవగుణములను మీలో పెంచుకోవాలి. అప్పుడే మీరు పెడమార్గము పట్టరు. లేకుండిన ఏ క్షణమైననూ పెడమార్గము పట్టవచ్చు. ఈ దుష్టబుద్ధులకు మీరు లోబడవచ్చు, చేసిన ఉపకారమును మరచిపోవచ్చు, ఉపకారికే అపకారము గావించవచ్చు. కనుక మీరు దైవాంశులమని గుర్తు వుంచుకొని మీ జీవిత నౌకను కొంతవరకు సన్మార్గములో సాగించటానికి ప్రయత్నించటము చాలా ప్రధానమని నేను హెచ్చరిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 03-09-1987న ఇన్‌స్టిట్యూట్ ఆడిటోరియంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vacharamrutam